శుక్రవారం
13మార్చి 2026
సంపుటి: 02 సంచిక:353
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

## లెబనాన్‌పై భారీ వైమానిక దాడి

20 మంది మృతి, 31 మందికి గాయాలు

లెబనాన్‌లో ఇప్పటి వరకు 634 మంది మృతి



# కొరత లేకుండా చర్యలు

పెట్టుబడులను ఆకర్షించండి


స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కలెక్టర్లకు ర్యాంకింగులిస్తాం..

పెట్టుబడులను రాబట్టేందుకు కలెక్టర్లకు 3సి ఫార్ములాలను నిర్దేశించిన ముఖ్యమంత్రి

అమరావతిలో క్రియేటివ్ సిటీ,

హిందూపూర్‌లో ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు ప్రకటన

6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో పెట్టుబడులు, టూరిజం శాఖలపై సీఎం సమీక్ష



అమరావతి : పెట్టుబడులు రాబట్టడం ఆయా శాఖలకు సంబంధించిన అంశంగా కాకుండా జిల్లా కలెక్టర్లు కూడా బాధ్యతగా తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు పెట్టుబడులు రాబట్టుకునేలా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో పెట్టబుడులను రాబట్టేలా కలెక్టర్లు కమిట్మెంట్‌తో పెట్టుబడిదారులను అన్వేషించి పెట్టుబడులు పెట్టేందుకు కన్విన్స్ చేసి ముందుకు వచ్చిన వారికి పూర్తిగా కో-ఆపరేట్ చేయాలంటూ జిల్లా కలెక్టర్లకు 3జ ఫార్ములాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున ముఖ్యమంత్రి వివిధ అంశాలపై సమీక్షించారు. పెట్టబుడి, టూరిజం శాఖలపై జరిగిన చర్చలో సీఎం కీలకాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్టానికి వచ్చిన పెట్టుబడులను వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెట్టుబడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడులు వస్తే... స్థానికంగా యువతకు ఉపాధి, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయి. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను

వివరాలు2లో..

## అమెరికాకు సహకరిస్తే దాడులు తప్పవు!




ఇరాన్ కొత్త నేత ఖమేనీ స్పష్టీకరణ

యుద్ధం ముగించాలంటే మూడు షరతులు

చమురు లాభాల కన్నా మాకిదే ముఖ్యమన్న ట్రంప్


## రాహుల్ గాంధీ స్ట్రాటజీ కన్సలెంటా!

-లోక్‌సభ ప్రచురించిన ఎంపీల ప్రొఫైల్ చూసి కొండా ఆశ్చర్యం

-పార్లమెంట్ కెఫెటేరియాలో సరదా చర్చ-'హూస్ హూ' పుస్తకం

న్యూఢిల్లీ, మార్చి 12: లోక్‌సభ ప్రచురించిన 'హూస్ హూ' పుస్తకంలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ప్రొఫైల్ చూ సి ఎంపీ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ఆశ్చర్యపోయారు. గురువారం పార్లమెంట్ విరామ సమయంలో ఈ పుస్తకాన్ని పరిశీలించిన బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాహుల్ గాంధీ తన ప్రొఫెషన్‌ను 'స్ట్రాటజీ కన్సల్టెంట్'గా

వివరాలు2లో..




# గ్యాస్ కొరతతో హోటల్స్ మూత

: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం ప్రభావం సామాన్యులపై పడుతోంది. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు ఎలా ఉన్నప్పటికీ యుద్ధం కారణంగా దేశ వ్యాప్తంగా కమర్షియల్ గ్యాస్‌కు తీవ్ర కొరత నెలకొన్న విషయం తెలిసిందే. దీని ప్రభావంతో రాష్ట్రంలోపలు హోటల్ మూత పడుతున్నాయి. గురువారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో చిన్న హోటళ్లు, బండ్లమీద జరిపే విక్రయాలు నిలిచిపోయినట్లు వార్తలు వచ్చాయి. అక్కడక్కడ పెద్ద హోటళ్లను, ప్రజల్లో బాగా ప్రాచుర్యం ఉన్న వాటిని కూడా మూసివేశారు. గ్యాస్ కొరత కారణంగా హోటళ్లను మూసివేస్తున్నట్లు వాటి యజమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు రేట్లు పెంచి విక్రయాలు చేస్తున్నారు. విశాఖపట్నంలోని కూర్మనపాలెం, గాజువాక వంటి ప్రాంతాల్లో ఐదు రోజుల క్రితం ఇరానీ టీ 15 రూపాయలు ఉండగా ప్రస్తుతం 20 రూపాయలకు పెంచి విక్రయిస్తున్నారు. విజయవాడలో పలుహోటళ్లలో రేట్లు పెంచి విక్రయాలు చేస్తున్నారు. ఐదు నుండి పది రూపాయల వరకు ఈ పెరుగుదల ఉంది. దోశ, చపాతి,పూరి, మైసూర్ బజ్జి వంటి వాటిపై పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. భోజన హోటళ్లలో మెనును తగ్గిస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. విజయవాడతో పాటు తిరుపతిలోనూ ఈ తరహా బోర్డులు కనిపించాయి,. కొన్ని హోటళ్ల మెనూలో కోత పెట్టడంతో




పాటు భోజనం రేట్లను కూడా పది నుండి 30 రూపాయల వరకు పెంచారు. విజయవాడ బస్‌స్టేషన్‌లో ఒక సంస్థ రెండు చోట్ల హోటళ్లు నిర్వహిస్తోంది. యుద్ధానికి ముందువరకు రెండు చోట్ల భోజనం తయారు చేసేవారు. ఇప్పుడు ఒకే చోట భోజనం తయారుచేసి మరో చోటకు తరలిస్తున్నారు తిరుపతి జిల్లా రేణిగుంటలో సగానికి పైగా హోటళ్లు మూతపడ్డాయి. అనేకచోట్ల గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా కట్టెలను, బొగ్గులను వాడటానికి హోటల్ యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి.

వివరాలు2లో..

విలువలు, విశ్వసనీయతకు పార్టీ కట్టుబడి ఉంటుందన్న వైసీపీ అధినేత

వైసీపీ అభిమాని కాలర్ ఎగిరేసేలా పార్టీ భవిష్యత్తు ఉంటుందన్న జగన్



## తాడేపల్లిలో వైసీపీ 16 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

● 2021 మార్చి 12న ఆవిర్భవించిన వైసీపీ● తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మిన్నంటిన వేడుకలు

● నల్లకాల్వలో ఇచ్చిన మాట కోసమే పార్టీ పుట్టిందన్న జగన్● వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజలు సొత్తు అని వ్యాఖ్య





## హైదరాబాద్ ప్రపంచ వైద్య రాజధాని

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మెడికవర్ ఆసుపత్రి ప్రారంభం

బల్క్ డ్రగ్స్ తయారీలో మనమే నంబర్ వన్: సీఎం రేవంత్ రెడ్డి

దేశంలో మెడికవర్ 25వ ఆసుపత్రి.. అత్యాధునిక 640 -స్లైస్ సీటీ స్కాన్

అందుబాటులోకి వైద్య రంగంలో సరికొత్త విప్లవం.. ఐదు సెకన్లలోనే గుండె స్కానింగ్




హైదరాబాద్, : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ హెల్త్‌కేర్ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా బల్క్ డ్రగ్స్ తయారీలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా నిలబెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నూతనంగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. భారతదేశంలో మెడికవర్ సంస్థకు ఇది 25వ ఆసుపత్రి కావడం విశేషం.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.., రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ప్రపంచ దేశాలకు ఔషధాలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఫార్మా రంగాన్ని తీసుకువెళ్తామని స్పష్టంచేశారు. హైదరాబాద్ కేవలం ఐటీ రంగంలోనే కాదు, లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగంలోనూ ప్రపంచానికే దిక్సూచిగా మారిందని చెప్పారు. ప్రపంచానికి అవసరమైన మూడో వంతు టీకాలను మన నగరమే ఉత్పత్తి చేస్తుదని అన్నారుఇప్పుడు బల్క్ డ్రగ్ తయారీలోనూ మనం అగ్రస్థానంలో ఉన్నామని, దీనిని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక ఫార్మా విలేజ్‌లు, మెడికల్ డివైజ్ పార్కులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. బల్క్ డ్రగ్స్ రంగంలో ఇతర

వివరాలు2లో..

## వాజ్‌పేయీ ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి పిలుపు

మాజీ ఉపరాష్ట్రపతి

ఎం.వెంకయ్యనాయుడితో భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్

దిల్లీ: మాజీ ప్రధానమంత్రి ఎ.బి.వాజ్‌పేయీ ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. అటల్ స్మృతిన్యాస్ సొసైటీ అధ్యక్షుడిగా ఆ సొసైటీ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై గురువారం దిల్లీలో పలువురు ప్రముఖులతో ఆయన చర్చించారు. భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు- ప్రహ్లాద్‌జోషి, జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రులు ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, సయ్యద్ షానవాజ్ హుసేన్, రాజీవ్

వివరాలు2లో..



## సిఇసి అభిశంసన తీర్మానంపై 193 మంది ఎంపిలు సంతకాలు




-న్యూఢిల్లీ : దేశ చరిత్రలోనే తొలిసారి ప్రతిపక్ష ఎంపిలు ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగించాలని కోరుతూ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబో తున్నాయి. ఈ నోటీస్‌పై ఇప్పటికే 193 మంది ఎంపిలు సంతకాలు

వివరాలు2లో..

## లోక్ సభ కంటే ఎల్ఓపీ ఉన్నతమైనదని కొందరి భావన

రాహుల్ గాంధీపై ఓం బిర్లా విమర్శలు

సభ నిబంధనల ప్రకారం సభ్యులు నడుచుకోవాలి

ఎవరికి ఎలాంటి ప్రత్యేక హక్కులు ఉండవు

నేనెప్పుడు నియమాలు ఉల్లంఘించలేదు

నావద్ద ఎలాంటి బటన్‌లు లేవు



## గ్యాస్ బ్లాక్‌మార్కెట్‌కు రాష్ట్రాలదే భాద్యత

ప్రతీరోజు 50 లక్షల సిలిండర్లు సరఫరా చేస్తున్నాం, కొరత లేదు

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్



ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక



## వాజ్‌పేయీ ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాలి

మొదటి పేజి తరువాయి

ప్రతాప్‌రూడీ, ఏబీవీపీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌కుమార్ భాటియా, భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, వాజ్‌పేయీకి మీడియా సలహాదారుగా పనిచేసిన అశోక్‌టాం డన్‌లు ఇందులో పాల్గొన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వాజ్‌పేయీ మహోన్నత నాయకుడని, ఆయన జీవితం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన పాటించిన విలువలు, దేశానికి అందించిన సేవలను గౌరవించుకోవడం తోపాటు, వారి వారసత్వాన్ని భావితరాలకు అందించనున్నట్లు చెప్పారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సొసైటీ ద్వారా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు వాజ్‌పేయీతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సొసైటీ కార్యకలాపాలకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

## హైదరాబాద్ ప్రపంచ వైద్య రాజధాని

మొదటి పేజి తరువాయి

దేశాలపై ఆధారపడ కుండా, స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా.. ప్రపంచానికి మనమే మెడికల్ హబ్‌గా మారుతాం అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తంచేశారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆసుపత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

వైద్య సేవలను ప్రజలకు చేరువచేస్తాం..

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రా జనర్సింహ మాట్లాడుతూ.., తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పా రు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణతో పాటు, ప్రైవేట్ రంగంలో వస్తున్న ఇటువంటి అత్యాధునిక ఆసుపత్రులు రాష్ట్ర వైద్య ముఖచిత్రాన్ని మారుస్తాయని, ఇటువంటి ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఎంతో సహాయపడతాయని మంత్రి తెలిపా రు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో 550 పడకల సా మర్థ్యంతో ఈ ఆసుపత్రి అందుబాటులోకి రావడం గొప్ప పరిణామమని ఆయన చెప్పారు.

ప్రపంచస్థాయి వైద్యమే మా లక్ష్యం..

మెడికవర్ ఆసుపత్రుల ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జీ అనిల్ కృష్ణ మాట్లాడుతూ.., హైదరాబాద్ ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ప్రారంభించామని చెప్పారు. ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ డాక్టర్ ఏ శరత్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా 640 -స్లైస్ సీటీ స్కాన్, కేవలం 5 సెకన్లలోనే గుండె స్కాన్ పూర్తిచేసే అత్యాధునిక సాంకేతికతను ఇక్కడ ప్రవేశపెట్టామన్నారు.

దీనివల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అత్యంత వేగంగా, ఖచ్చితమైన రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించగలమని వివరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీ హరి కృష్ణ మాట్లాడుతూ, హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి వైద్య సేవల అవసరం ఉందని, ఆ అవసరాన్ని గుర్తించి దేశంలోనే అత్యంత ఎత్తున ఆసుపత్రి భవనాలలో ఒకటిగా దీనిని నిర్మించామని తెలిపారు.

డైరెక్టర్ డాక్టర్ ఏఆర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, అత్యాధునిక పరికరాలతో రోగులకు సమగ్ర వైద్య విధానాలను అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పారిశ్రామికవేత్తలు వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

### సిఇసి అభిశంసన తీర్మానంపై
## 193 మంది ఎంపిలు సంతకాలు



మొదటి పేజి తరువాయి

చేశారు. అందులో 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌సభలోగానీ, రాజ్యసభలోగానీ ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్ తొలగింపు నోటీస్‌పై ఎంపిలు ఉత్సాహంగా సంతకాలు చేస్తున్నారని, ఇప్పటికే నోటీస్ ఇచ్చేందుకు అవసరమైన ఎంపిల సంఖ్య పూర్తయ్యిందని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ గురువారం చెప్పినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ నిబంధనల ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్ తొలగింపు కోరుతూ నోటీస్ ఇవ్వాలంటే ఆ నోటీస్‌పై కనీసం 100 మంది లోక్‌సభ సభ్యులు, కనీసం 50 మంది రాజ్యసభ సభ్యులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఆ సంఖ్య ఇప్పటికే దాటినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీలకు చెందిన ఎంపిలు ఈ నోటీస్‌పై సంతకాలు చేసినట్లు సమాచారం. ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపిలు కూడా సంతకాలు పెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికార బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో ఆయన తొలగింపును కోరుతూ ఎంపిలు నోటీస్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# అమెరికాకు సహకరిస్తే దాడులు తప్పవు!

టెహరాన్, టెల్ అవీవ్, వాషింగ్టన్ : తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్మూజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయాలని ఆదేశించారు. ముడి చమురు ధరల కన్నా ఇదే ముఖ్యం: ట్రంముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ వ్యాఖ్యానించారు. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా కృతనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్థవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగుతాయని ఆయన అన్నారు. సార్వభౌమాధికారాన్ని గుర్తించాల్సిందే : ఇరాన్ మూడు షరతులతాను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తిప్పికొట్టింది. యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోవాల్సింది తామేనని స్పష్టం చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు మూడు షరతులు విధించింది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని, నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు జరగకుండా అంతర్జాతీయ సమాజం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆ మూడు షరతులు నెరవేరుస్తామని హామీ ఇస్తేనే యుద్ధాన్ని ముగిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రష్యా, పాకిస్తాన్ నేతలతో టెలిఫోన్‌లో చర్చల అనంతరం ఆయన ఈ పోస్ట్ పెట్టారు. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ముందుగా దాడులు ప్రారంభించింది ఆ రెండు దేశాలేనని, కాబట్టి వారి నుండి స్పష్టమైన హామీలు లభిస్తేనే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని తేల్చిచెప్పారు.

హార్మూజ్‌లో భారత నౌకలకు అనుమతి

స్వదేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హర్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. ఈ యుద్ధం ఆరంభమైన దగ్గర నుండి ఇప్పటివరకు ఇరువురు మంత్రులు మూడుసార్లు మాట్లాడుకున్నారు. లైబీరియా పతాకంతో ఉన్న చమురు నౌక కూడా ముంబయి ఓడరేవుకు చేరుకుంది. సౌదీ అరేబియాలోని రాస్ తనురా ఓడరేవులో చమురును నింపుకుని వచ్చింది.

# గ్యాస్ బ్లాక్‌మార్కెట్‌కు రాష్ట్రాలదే భాధ్యత

న్యూఢిల్లీ: వంట గ్యాస్ కొరతకు సంబంధించి బ్లాక్ మార్కెట్‌ను రాష్ట్రాలే నిరోధించాలని కేంద్రం స్పష్టం చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటిఎఫ్) లేదా ఫ్యూయల్ ఆయిల్ వంటి ఇంధనాలకు ఎటువంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి గురువారం పార్లమెంట్‌లో వెల్లడించారు. వినియోగదారుల ఆందోళన కారణంగానే పంపిణీ దారులు, రిటైల్ స్థాయిలో నిల్వ, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని, సరఫరా కొరత లేదని ఆయన లోక్‌సభలో తెలిపారు. భారతదేశం గతంలో గల్ఫ్ దేశాల నుండి 60 శాతం ఎల్‌పిజిని దిగుమతి చేసుకునేదని, 40 శాతం దేశీయంగా ఉత్పత్తి అవుతుందని వివరించారు. గల్ఫ్ వనరులతో పాటు అమెరికా, నార్వే, కెనడా, అల్జీరియా, రష్యా నుండి కూడా ఎల్‌పిజిని వేగవంతంగా సేకరిస్తున్నామని తెలిపారు. దేశీయ సరఫరా సజావుగా ఉందని, డెలివరీ పక్రియ మారలేదని, బుకింగ్ నుండి డెలివరీకి సమయం 2.5 రోజులు అని పేర్కొన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ప్రాధాన్యత ప్రాతిపదికన సరఫరా జరుగుతోందని మంత్రి తెలిపారు. సరఫరా పరిమితి వాతావరణంలో బ్లాక్ మార్కెట్ పనిచేస్తోందని, ఇది నిల్వ, దారి మళ్లింపు, అధిక ధరలకు తిరిగి అమ్మకానికి దారితీసిందని అంగీకరించారు. నిల్వను నిరోధించడానికి, ప్రభుత్వ యాజమాన్యంలోని ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన తెలిపారు.

# తాడేపల్లిలో వైసీపీ 16 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

తాడేపల్లి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ కేంద్ర కార్యాలయానికి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వైయస్సార్ చిత్రపటానికి పూలు సమర్పించి, నివాళులర్పించిన వైఎస్ జగన్, ఆ తర్వాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈరోజు మరొక్కసారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైయస్సార్‌ను అభిమానించే ప్రతి గుండెకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడికి, రాష్ట్ర వ్యా ప్తంగా ఉన్న ప్రజలందరికీ కూడా ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఇంకా వైయస్సార్‌ను ప్రేమించే ప్రతి గుండె, ఏ రాష్ట్రంలో ఉన్నా, ఆ ప్రతి గుండెకు ఈరోజు శుభాకాంక్షలు తెలి యజేస్తున్నానంటూ వైఎస్ జగన్ ప్రసంగాన్ని ము గించారు. పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొరత లేకుండా చర్యలు

మొదటి పేజి తరువాయి

ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ పేరుతో అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ రీజియన్ కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, అమరావతికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్, తిరుపతి రీజియన్ కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారు. రీజియన్ల వారీగా పరిశ్రమలు, పెట్టుబడులు, ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ఈ అధికారులు తీసుకుంటారు. పెట్టుబడులపై ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షించి ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి. అనుమతులు వేగంగా ఇవ్వటంతో పాటు భూ కేటాయింపులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలి. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారు. ఓర్వకల్లులో పారిశ్రామిక క్లస్టర్ రూపకల్పన చేశాం. ఇప్పుడు ఎయిర్ పోర్టు లాంటి మౌలిక సదుపాయాలు కూడా వచ్చాయి. ఇప్పుడు భవిష్యత్తులో ఓ మేజర్ పారిశ్రామిక హబ్ గా మారుతుంది. కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఆ పారిశ్రామిక క్లస్టర్ గా తయారు కావాలి."అని ముఖ్యమంత్రి చెప్పారుపెట్టుబడులపై జిల్లాల్లోనూ సమావేశాలు పెట్టాలి : పెట్టుబడులపై జిల్లాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలి. పెట్టుబడులు రాబట్టేందుకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంపై జిల్లాల వారీగా ర్యాంకులిస్తాం. 2019-24లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అమర్ రాజా కంపెనీ తిరుపతిలో కార్పోరేట్ ఆఫీస్ పెట్టింది... వారినీ గత పాలకులు పారిపోయేలా చేశారు. 2014-19లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని బెంగళూరుకు పోటీగా తీర్చిదిద్దాం. మోస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాం. ఎకో సిస్టం కల్పించాం. ఇప్పుడు ఆ ఫలితాలు హైదరాబాద్ అనుభవిస్తోంది. ఇప్పుడు రాష్ట్రం మొత్తం అదే తరహా ఎకో సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జిల్లాల్లో పరిశ్రమలు రాకుంటే ఆ జిల్లాల్లో టూరిజం ప్రమోట్ చేయాలి. లేదా ఐటీని ప్రమోట్ చేయాలి... ఎంఎస్ఎంఈలు ప్రమోట్ చేయాలి.. అగ్రికల్చర్ ప్రమోట్ చేయాలి. ఇలా ఏదో ఒక రంగంలో ఆయా జిల్లాలకున్న ప్రత్యేకతలను, అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాలి. జిల్లాలకున్న అడ్వాంటేజీలను ప్రమోట్ చేసి పెట్టుబడులను ఆకర్షించాలి. పెట్టుబడులు పెట్టేవారందరూ తమ దగ్గరకే రావాలని జిల్లా కలెక్టర్లు, మంత్రులు అనుకోకూడదు. పెట్టుబడులు పెట్టే వారెవరో గుర్తించి వారిని కలెక్టర్లు, మంత్రులు సంప్రదించే పరిస్థితి రావాలి. ఇదే విధంగా హైదరాబాద్ ను ప్రమోట్ చేయడం వల్లే ఖాదీ వచ్చింది. జిల్లాల్లో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలు, తలసరి ఆదాయం ఎంతమేర పెంచాం అన్నదానిపై జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టాలి. తదుపరి సమావేశం నుంచి ఏ జిల్లా కలెక్టర్ ఎంతమేర పరిశ్రమల్ని ప్రోత్సహించారన్న దానిపై సమీక్షిస్తాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే లాంటి ఇన్ఫ్రా ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హిందుపూర్ సమీపంలో ఎలక్ట్రానిక్స్ సిటీని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం."అని సీఎం చంద్రబాబు చెప్పారుఆతిథ్య రంగంలో అభివృద్ధికి ఆస్కారం : ఏపీలో ఆతిథ్య రంగానికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. అందుకే పర్యాటకానికి పారిశ్రామిక హోదాను కల్పించాం. ఏమీ లేని ప్రాంతాల్లోనే కొన్ని దేశాల్లో టూరిజం అభివృద్ధి చేస్తున్నారు. ఏపీలో అనేక చరిత్రాత్మక ప్రాంతాలు.. ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేసే అంశంపై ఫోకస్ పెట్టాలి. పురాతన కట్టడాలు చాలా ఉన్నాయి.. వాటికి ఎంతో చరిత్ర ఉంటుంది.. వాటిని ఎంకరేజ్ చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు సిద్ధం కావాలి. వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలు పెద్ద ఎత్తున రావాలి. కన్వెన్షన్ సెంటర్లు, మైస్ సెంటర్లు నిర్మాణం చేయాలి. యుద్ధ ప్రభావాల నేపథ్యంలో విదేశాల కంటే స్థానికంగా ఉండే పర్యాటకానికి పెద్దఎత్తున ఆకర్షణ పెరుగుతుంది. దేవాలయాలు పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు... మానసిక ఉల్లాసాన్ని కలిగించే ప్రాంతాలు వాటిని అభివృద్ధి చేయాలి. పాపికొండలు, గండికోట భారత్ కే గ్రాండ్ కాన్యన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుంది. జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి. టూరిజం ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో పాటు మాన్యుమెంట్లను కూడా అభివృద్ధి చేయాలి. తిమ్మమ్మ మర్రిమాను వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుంది. కంభం చెరువు ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరు. పులికాట్ సరస్సులో పర్యాటక ప్రాజెక్టును ప్రతిష్టాత్మక కంపెనీలకు అప్పగించి అభివృద్ధి ద్వారా వేగంగా అభివృద్ధి జరుగుతుంది. జాతీయ రహదారులపై వే సైడ్ అమెనిటీస్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, నైట్ హాల్ట్ కోసం గదులు నిర్మాణం చేపడితే పెట్టుబడులు వస్తాయి. ఏపీఐఐసీ ద్వారా చేసే ల్యాండ్ అలాట్మెంట్ లో 5 ఎకరాల వరకూ కేటాయింపులు చేసేలా జిల్లా కలెక్టర్లకు ఆథరైజేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

## రాహుల్ గాంధీ స్ట్రాటజీ కన్సలెంటా!




మొదటి పేజి తరువాయి

పేర్కొనడం చూసి ఆశ్చర్యపోయినట్లు ట్వీట్ చేశారు. ఎంపీలు స్వయంగా ఇచ్చిన సమాచారం ఆధారంగానే వారి వి ద్యా, వృత్తిగత నేపథ్యాలతో ఈ పుస్తకం రూపొందుతుంది. పార్లమెంట్ సభ్యుల వ్యక్తిగత, వృత్తి వివరాలతో కూడిన 'హూస్' హూ' పుస్తకంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రొఫెషన్ చూసి ఆశ్చర్యపోయినట్లు విశ్వేశ్వర్ రెడ్డి ట్వీట్ చేశారు. పార్లమెంట్ స మావేశాల విరామ సమయంలో తోటి ఎం పీలతో కలిసి ఈ పుస్తకాన్ని పరిశీలిస్తూ ఆ యన పంచుకున్న ఆసక్తికర విషయాలు ఇ ప్పుడు వైరల్ అవుతున్నాయి. లోక్‌సభ స మావేశాలు జరుగుతున్న సమయంలో సభ కాసేపు వాయిదా పడటంతో. ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు తదితరులు పార్లమెంట్ కెఫెటేరియాలో టీ తాగేందుకు వెళ్లారు. ఆ సమయంలో లోక్‌సభ సచివాలయం తమకు కాంప్లిమెంటరీగా అందించిన 'హూస్' హూ'పుస్తకాన్ని ఎంపీ కొండా తిరిగేశారు. అందులో ఎంపీల విద్యా అర్హతలు, వృత్తి, గత నేపథ్యం, వారి ఆసక్తుల వివరాలు పొందుపరిచారు. ఆ పుస్తకంలో తన వివరాలను చూసుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి..తన వృత్తి 'ఇంజనీర్' అని సరిగ్గా పేర్కొనడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సహచర ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరుల ప్రొఫైల్ చూశారు. ఆ తర్వాత రా హుల్ గాంధీ ప్రొఫైల్ను చూసిన ఆయన కా స్త ఆశ్చర్యానికి గురయ్యారు. రాహుల్ గాంధీ తన వృత్తిని 'స్ట్రాటజీ కన్సల్టెంట్'గా బుక్లో పొందుపరిచారు. కాగా రాహుల్‌గాంధీ రాజకీయాల్లోకి రాకముందు విదేశాల్లో మేనేజ్మెం ట్ కన్సల్టింగ్ రంగంలో పనిచేసినట్లు తెలిసింది.

### లోక్ సభ కంటే ఎల్ఓపీ
## ఉన్నతమైనదని కొందరి భావన

న్యూఢిల్లీ, మార్చి 12: తనపై ప్రతిపక్షం పెట్టిన అవిశ్వాస తీర్మానం సభలో వీగిపోయిన తర్వాత గురువారం లోక్‌సభ స్పీకర్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన ఓం బిర్లా తన చర్యలు నిష్పాక్షికంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రతి ఎంపీ లోక్‌సభలో మాట్లాడేలా తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని ప్రతిపక్ష నాయకుడు 'సభకు పైన' లేదని చెబుతూ, రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు .'ప్రతిపక్ష నాయకుడు సభ కంటే ఉన్నతంగా ఉంటారని, ఏ అంశంపైనైనా మాట్లాడగలరని కొందరు సభ్యులు అభిప్రాయపడ్డారు. అయితే, ఎవరికీ అలాంటి ప్రత్యేక హక్కులు లేవుసభ దాని నియమాల ప్రకారం పనిచేస్తుంది' అని బిర్లా రాహుల్ గాంధీని ఉద్దేశిం చి విమర్శించారు. 'ప్రధానమంత్రి, మంత్రు లు కూడా ప్రకటనలు చేయడానికి సభ నిబంధనల ప్రకారం నోటీసు ఇవ్వాలి' అని స్పీకర్ స్పష్టం చేశారు. తాను పక్షపాత ధోరణితో వ్యవహరించానన్న ప్రతిపక్షాల ఆరోప ణను తోసిపుచ్చిన బిర్లా, 'నేను ఎల్లప్పుడూ సభ కార్యకలాపాలను నిష్పాక్షికంగా, క్రమశిక్షణతో, సమతుల్యతతో, నిబంధనలకు అను గుణంగా నిర్వహించడానికి ప్రయత్నించాను' అని అన్నారు. ప్రతిపక్ష సభ్యుల మైక్రోఫోన్లను చైర్ ఆపివేశారనే ఆరోపణలను కూడా ఆయన ప్రస్తావించారుమైక్రోఫోన్ యాక్టివేషన్ పై చైర్‌కు ఎటువంటి నియంత్రణ లేదని బిర్లా స్పష్టం చేశారు. మైక్రోఫోన్లను ఆన్ లే దా ఆఫ్ చేయడానికి చైర్‌కు ఎటువంటి బట న్ లేదు. మాట్లాడటానికి అనుమతి ఉన్న సభ్యునికి మాత్రమే సిస్టమ్ మైక్రోఫోన్‌ను యాక్టివేట్ చేస్తుంది అని ఆయన వివరించారు. పార్లమెంటరీ మర్యాద ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, కాగితాలను చింపివే యడం, సభ వెల్లోకి ప్రవేశించడం వంటి అంతరాయం పార్లమెంటు గౌరవం, పార్లమెంటు దాదాపు 1.4 బిలియన్ల భారతీయుల ఆకాంక్షలను సూచిస్తుందని, ప్రతి సభ్యుడు ప్రజా ఆందోళ నలను లేవనెత్తడం, వారి నియోజకవర్గాల అంచనాలను నెరవేర్చడం బాధ్యత అని స్పీకర్ పేర్కొన్నారుమహిళా ఎంపీల పట్ల తనకున్న గౌరవాన్ని బిర్లా పునరుద్ఘాటించారు, సభలో మాట్లాడే అవకాశాలు వారికి లభించేలా నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తన పదవీకాలంలో, మొదటిసారి ఎంపీలైన ప్రతి మహిళా సభ్యురాలికి తన అభిప్రాయాలను

## లెబనాన్‌పై భారీ వైమానిక దాడి

బీరుట్, మార్చి 12: అమెరికా ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం ఉధృతం అవుతోంది. గురువారం లెబనాన్ రాజధాని బీరుట్ సముద్రతీర ప్రాంతమైన రామ్లెట్ అల్‌ఖైదా వద్ద ఇజ్రాయెల్ భారీ వైమానికదాడి జరిపింది. టైర్ జిల్లాలోని బుర్జ్ షమాలి పట్టణంలో, అరమౌన్ పట్ట ణం, బింట్ జుబైల్ జిల్లాలో, మఆరాకా -టైర్ కూడలిలో, బల్‌బెక్ జిల్లాలోని షాత్ పట్టణంపై జరిగిన దాడుల్లో కనీసం 20 మంది మృతి చెందారు. 31 మంది గాయపడ్డారు. ఈ మేరకు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. బాంబు దాడుల కారణంగా ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు టెంట్లలో నివసిస్తున్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ప్రజలు టెంట్లలో నిద్రిస్తున్న సమయంలో యుద్ధ విమానాల గర్జన వినిపించిందని, కొద్దిసేపటికే రెండు భారీ పేలుళ్లు సంభవించాయని వారు చెప్పారు. ఇలాంటి దాడుల ను 'కచ్చిత లక్ష్యాలపై దాడులు'గా ఇజ్రాయెల్ పేర్కొంటున్నప్పటికీ, ఈ దాడిలో ఎక్కువగా పౌరులే ప్రాణాలు కోల్పోయారని సమాచారం. దక్షిణ లెబనాన్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి.

అరమౌన్ పట్టణంపై జరిగిన దాడిలో ముగ్గురు మృతి చెందారు. ఒక చిన్నారి గాయపడింది.

# గ్యాస్ వినియోగదారులకు ఆందోళన వద్దు

## జిల్లాలో ఎటువంటి గ్యాస్ కొరత లేదు... తగినన్ని నిల్వలు ఉన్నాయి-జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి




ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 12 : జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, జిల్లాలో గ్యాస్ కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందనే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. గ్యాస్ దొరకదనే అపనమ్మకంతో ఖంగారు పడి సిలిండర్ ఖాళీ కాకుండానే ముందస్తుగా బుక్ చేస్తున్నారని, ఖాళీ సిలిండర్ ఇస్తేనే కొత్తది సరఫరా చేయడం జరుగుతుందని జేసీ తెల్పి చెప్పారు. గురువారం ఆయన జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి, నిల్వలు మరియు పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలను జేసీ, సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు గ్యాస్ నిల్వలు, పంపిణీ తీరును పరిశీలించినట్లు చెప్పారు. జిల్లాలో వంట గ్యాస్ సరఫరా సాధారణంగానే ఉందని, ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని అన్నారు. గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, జిల్లాలోని 15 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సుమారు 1.20 లక్షల మంది వినియోగదారులకు గ్యాస్ అందుతోందని వివరించారు. ప్రస్తుతం గోడౌన్లలో 9,000 పైచిలుకు సిలిండర్ల నిల్వలు ఉన్నాయని, విశాఖపట్నంలోని బాట్లింగ్ ప్లాంట్ల నుండి ప్రతిరోజూ జిల్లాకు గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నట్లు పేర్కొన్నారు. రోజువారీగా 3 నుండి 4 వేల బుకింగ్లు సజావుగా జరుగుతున్నాయని, అయితే యుద్ధ వాతావరణం వలన గ్యాస్ కొరత ఉండవచ్చనే అపోహతో దాదాపు 80 శాతం బుకింగ్స్ పెరిగినట్లు జేసీ తెలిపారు.

**ప్రభుత్వం తరపున గ్యాస్ వినియోగదారులకు విజ్ఞప్తి**

గ్యాస్ పంపిణీలో ఎటువంటి కొరత లేదని, ఇంతకుముందు ఏ విధంగా సరఫరా అయిందో, ప్రస్తుతం కూడా అదేవిధంగా సరఫరా చేసేందుకు యంత్రాంగం మొత్తం సమాయత్తమై ఉందన్నారు. దయచేసి ఎటువంటి అపోహలకు గురికావద్దని, అవసరం లేకపోయినా కూడా గ్యాస్ మీరు బుక్ చేసుకొని కృత్రిమ కొరత సృష్టించడంలో పాల్పంచుకోవద్దని జేసీ విజ్ఞప్తి చేశారు.

**గ్యాస్ ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్**

గ్యాస్ సరఫరాలో ఫిర్యాదుల కొరకు జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలు వసూలు, బుకింగ్ చేసినా సరఫరా చేయక పోవడం వంటి సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 70130 60665 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా సమస్యను పరిష్కరించి, తీసుకున్న చర్యలను వినియోగదారులకు తెలియజేస్తామని జెసి ఈ సందర్బంగా హామీ ఇచ్చారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఆకస్మిక పర్యటనలో జిల్లా సరఫరాల అధికారి బి.అశోక్ కుమార్, గ్యాస్ ఏజెన్సీల డిస్ట్రిబ్యూటర్లు, పౌర సరఫరాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# రైతన్నల శ్రేయస్సు కోరుతున్న ప్రభుత్వం

- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది- రాష్ట్ర మంత్రి - కొండపల్లి శ్రీనివాస్ - సర్వే పూర్తి కాని మరియు ఇనాం భూములు సాగు చేస్తున్న 586 మంది రైతులకు లబ్ధి.

ప్రజాస్వామ్యం – విజయనగరం/అమరావతి:

అన్నదాత సుఖీభవ అంటూ ప్రతీ రైతన్న శ్రేయస్సు కోరుతూ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, ప్రతీ రైతన్నకు అండగా నిలుస్తోందని, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ కలిపి ఏడాదికి ఒక్కో రైతుకు 20 వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. నేటికి రెండు విడతల్లో 14 వేల రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం 6 వేల 309.44 కోట్ల రూపాయలను పంపిణీ చేయడం జరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గుర్తు చేసారు. ఇప్పుడు మరో విడత శుక్రవారం అనగా, 13 మార్చ్ 2026 నాడు రైతుల ఖాతాలో మరొక్కసారి రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందని, కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే విజయనగరం జిల్లాలోని నాలుగు మండలాల్లో మొత్తం 586 మంది రైతులు, సుమారు 323.13 ఎకరాల సర్వే పూర్తి కానీ మరియు ఇనాం భూములను సాగు చేస్తున్నట్లు గుర్తించి, వారికి కూడా అన్నదాతా సుఖీభవ కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది అని మంత్రి పేర్కొన్నారు. జామి మండలం తాండ్రంగి గ్రామంలోని 37 మంది రైతులు సాగు చేస్తున్న 27.1 ఎకరాలు, గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామంలో 61 మంది రైతులు సాగు చేస్తున్న 50.19 ఎకరాలు, సంతకవిటి మండలంలోని యం.యస్.ఆర్.పురంలో 172 మంది రైతులు సాగు చేస్తున్న 141.32 ఎకరాలు ఢ గొల్లలవలస గ్రామంలో 303 మంది రైతులు, సాగు చేస్తున్న 99.65 ఎకరాలు, దత్తిరాజేరు మండలం భూపాలరాజపురం గ్రామంలో 13 మంది రైతులు సాగు చేస్తున్న 4.87 ఎకరాలకు సంబంధించిన భూములకు సైతం పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇది రైతన్నలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని మంత్రి స్పష్టం చేసారు.




# 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవ వేడుకలు



**ప్రజాస్వామ్యం, విజయనగరం**

ఈ నెల 16వ తేదీన తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని మహారాజా అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు పేర్కొన్నారు. ఈ రోజు కోటలో గల తన కార్యాలయంలో సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్‌తో కలసి ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పొట్టి శ్రీరాములును నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గురుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పొట్టి శ్రీరాములు గురించి అవగాహన కల్పించడమే గాక కళాశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామని విజేతలకు 16వ తేదీన బహుమతి ప్రదానం ఉంటుందని అన్నారు. 16వ తేదీ ఉదయం 9 గంటల 30 నిమిషాలకు మోతీమహల్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో సాంస్కృతిక ఉత్సవం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ రోజున జరిగే కార్యక్రమంలో సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త కన్నయ్య పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సలహాదారు ఎ శ్రీనివాసరావు, కళాశాల తెలుగు విభాగపు అధిపతి డాక్టర్ ఎన్ సూర్యకాంతి, ఎన్ ఎస్ ఎస్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర రావు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు సి హెచ్ చిన్నంనాయుడు, డాక్టర్ పి ఎన్ బి శర్మ, డాక్టర్ ఎస్ వై విష్ణు, తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి విజయభాస్కర్, సిహెచ్ చేతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్ సి ని మర్యాదపూర్వకంగా కలిసిన యువభారత్ కన్వీనర్ జోగారావు



**భీమునిపట్నం, ప్రజాస్వామ్యం**

భీమిలి జోనల్ కమిషనర్ గా బదిలీ పై వచ్చిన ఎం. విజయ కుమార్ ను “భీమిలి శాఖ యువ భారత్ మరియు వివేకానంద రీడింగ్ రూమ్” నిర్వాహకులు సంకురుభుక్త జోగారావు గురువారం జోనల్ కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యువ భారత్ సంస్థ ద్వారా చేస్తున్నటువంటి కార్యక్రమం లు గురించి మరియు వివేకానంద రీడింగ్ రూమ్ ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు ఉచితం గా నిర్వహించే లైబ్రరీ గురించి వివరంగా తెలియజేయడమైనది. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, గాడు యశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా తీసుకువచ్చిన స్కీమ్ ను రద్దు చేయాలి

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాస్వామ్యం/ సాలూరు/ మన్యం జిల్లా.. మార్చ్ 12:

రేపు జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ సాలూరు మండలంలో జీగిరం, కొత్తవలస,ఖరాసవలస , మామిడిపల్లి,మరిపల్లి గంగన్నదొరవలస, తోనాశీ , దండిగాం.కురుకుటి, సారిక కొత్తూరు తదితర గ్రామాల్లో ప్రచారం చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీఎ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్కీమ్ ను రద్దు చేయాలిమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి పాత పద్ధతిలోనే ఉపాధి మీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు గతంలో కేంద్ర ప్రభుత్వం 90% రాష్ట్ర ప్రభుత్వం 10% నిధులు కేటాయింపులు జరిగేవి నూతనంగా తీసుకువచ్చిన స్కీమ్ లో కేంద్ర ప్రభుత్వం 60% రాష్ట్ర ప్రభుత్వం 40% కేటాయించి కేటాయింపులు చేయాలని నిబంధన తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడి కూలీలకు నష్టం జరిగే ప్రమాదం ఉంది. నూతన చట్టంలో సంవత్సరంలో 60 రోజులు పనులు చేయకూడదని నిషేధం విధించి నిబంధన తీసుకు రావడం సరికాదని అన్నారు ఈ నూతన చట్టం వలన ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం జరిగి అవకాశం ఉంది అన్ని రకాల పనులు గుర్తించి చేయాలి కానీ నూతన చట్టంలో 4 రకాల పనులు మాత్రమే చేయాలని తీసుకొచ్చింది గతంలో రైతు పొలాల్లో చేసే పనులకు 50 లక్షలు వరకు అవసరాన్ని బట్టి జరిగేది కానీ నూతనంగా తీసుకువచ్చిన స్కీం ప్రకారం రైతుకు 2 లక్షల వరకు మాత్రమే కేటాయింపులు చేయాలనే నిబంధన తీసుకువచ్చారు నూతనంగా వచ్చిన స్కీమ్ వలన జరిగే మేలు కంటే నష్టం ఎక్కువగా జరుగుతుంది కూలి రేట్లు గతంలో రోజు కూలి 307 రూపాయలు వచ్చేది నూతనంగా తీసుకు వచ్చిన లో రోజు కూలి 240 రూపాయలకు తగ్గించారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 రూపాయలు సంవత్సరానికి 200 రోజు లూ పని కల్పించాలని డిమాండ్ చేశారు కావున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి నూతనంగా తీసుకు వచ్చిన స్కీమ్ ను రద్దు చేయాలని కోరారు లేనియెడల కూలీలందరినీ సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని రేపు జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమంను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుల కోరాడ ఈశ్వరరావు, మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల నాయకులు జన్ని ఈశ్వరరావు, సూర్రు రావు తదితరులు పాల్గొన్నారు.





## అవంతిలో నేటి నుండి “అవెన్సిస్ 2కె26” యువజనోత్సవాలు




**తగరపువలస, ప్రజాస్వామ్యం** అవంతి ఇంజనీరింగ్ కళాశా లలో “అవెన్సిస్ 2కె26” పేరుతో జాతీయ స్థాయిలో యువజనోత్సవాలు వేడుకలను 13, 14 తేదీలలో రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నామని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటన లో తెలియచేసారు. అతిథిలుగా డా. జి. జయసుమ, రిజిస్ట్రార్ జె.ఎన్.టి.యు. గురజాడ, విజయనగరం, శ్రీధర్ కోసరాజు, ఎమ్.డి., నిమల్ సాఫ్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, డా. పి.పి. లాల్ కృష్ణ, ఎమ్.డి. సీ.ఈ.ఓ., విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్, మిస్టర్ జి. మురళీకృష్ణ, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, ఉషా నగిశెట్టి, ఇండియన్ బాక్సర్ మేజర్ ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత విచ్చేయు నున్నారు. అలాగే అవంతి యువతను కేరింతలతో హుషారైన పాటలతో మెప్పించడానికి ప్లే బ్యాక్ సింగర్ గీతామా ధురి విచ్చేయనున్నారు. ఈ యువజనోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడాంశాలు అయినటువంటి బాస్కెట్ బాల్, కబడ్డీ, వాలీబాల్, కోకో, క్రికెట్, త్రోబాల్, చెస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, యోగా, కరాటే, స్లో బైక్ రేస్, ట్రెజరీ హంట్, పాటలు పోటీలు, సోలో నృత్యం, గ్రూప్ డాన్సులు, స్కిట్స్, స్టాండ్ అప్ కామెడీ, స్పాట్ ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ఎడ్వర్టైజ్మెంట్ కాంపిటేషన్, ఆటో ఎక్స్పో, ఈ స్పోర్ట్స్, ఫ్యాషన్ షో, రాక్ బ్యాండ్, బాడీ బిల్డింగ్ షో, మెమోస్ క్రియేషన్, రాంప్ వాక్ మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీలు నిర్వహించి అత్యున్నత ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రములను అవంతి శ్రీనివాసరావు గారు చేతులు మీదుగా అందచేస్తారని తెలియచేశారు.

# వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి

తగరపువలస, ప్రజాస్వామ్యం ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూషన్ అఫ్ మెడికల్ సైన్సెస్, సంగివలస వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు గురువారం కళాశాల ప్రాంగణం లో డా.ఎన్టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈఏఎస్ఈ (ఎమోషనల్ అసెస్మెంట్ అఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్) – ఏపీ ట్రైనర్లు ఆత్మ హత్యల నివారణ అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెందకుండ ధైర్యంగా ఒత్తిడిని ఎదుర్కోవాలని మరియు వైద్య విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి అని సూచించారు. ఈఏఎస్ఈ (ఎమోషనల్ అసెస్మెంట్ అఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్) – ఏపీ ట్రైనింగ్ డైరెక్టర్ నెల్సన్ వినోద్ మోజెస్ మరియు సంగీత మాట్లాడుతూ వైద్య విద్యలో చేరిన ప్రతి విద్యార్థి ఒత్తిడిని సున్నితంగా ఎదుర్కొని, వారి వైద్య విద్యని విజయవంతంగా పూర్తి చేసి సమాజానికి సేవలు అందిచాలని వివరించారు. ఈ ట్రైనింగ్ కోసం ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూషన్ అఫ్ మెడికల్ సైన్సెస్, సంగివలస వైద్య కళాశాలని ఎంచుకున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏ. భాగ్యలక్ష్మి ఈ ఈఏఎస్ఈ డైరెక్టర్ డా. అపర్ణ ఉప్పలకు ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో డా. కే. నరేష్, డా. ఎస్.ఎస్.కే. ప్రకాష్, డా. కే. విజయ, డా. రేఖా దత్, డా. పి. హిమకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోర్స్ ట్రైనర్లు నెల్సన్, సైకాలజిస్ట్ డా. సంగీత లను డా. ఏ. భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ పుష్పగుచ్చం మరియు శాలువా తో సత్కరించారు.



# ఘనముగా వై.ఎస్.ఆర్.సి.పి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**---- 15 వసంతాలు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగుపెట్టిన వై.ఎస్.ఆర్.సి.పి- మాజీ ఎమ్మెల్యే - బొత్స అప్పలనరసయ్య**



ప్రజాస్వామ్యం / గజపతినగరం: స్థానిక వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనముగా జరిగాయి. తొలుత బొత్స అప్పలనరసయ్య పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి,వై.యస్. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలనరసయ్య మాట్లాడుతూ ,పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని 15 వసంతాలు పూర్తిచేసుకుని 16వ వసంతంలోనికి పార్టీ అడుగుపెట్టడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో 40 శాతము ఓట్ బ్యాంక్ కలిగిన ఏకైక పార్టీ వైఎస్ఆర్సిపి పార్టీ అన్నారు. 10 సంవత్సరాలు ఎన్నో పోరాటాలు చేసిన తర్వాత అధికారంలోనికి వచ్చి ప్రజలకు ఐదేళ్ల సంక్షేమ,అభివృద్ధి పాలన అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, తమ అధినేత జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. గడిచిన ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు మాయమాటలు నమ్మి ప్రజలు కూటమి కి అధికారం కట్టబెట్టారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు జగన్ ను ఓడించినందుకు చింతిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తౌడు, మండల నాయకులు కరణం ఆదినారాయణ ,వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, ఎంపీపీ చల్ల చల్లమనాయుడు, తాళ్లపూడి అప్పలనాయుడు, బెల్లాన త్రినాధరావు, గేదెల ఈశ్వరరావు, కె. పైడిపు నాయుడు ,కర్రీ రామునాయుడు, లెంక గణేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ ఎల్లమాంబ అమ్మవారి అన్న సమారాధనలో సిరమ్మ



విజయనగరం (ప్రజాస్వామ్యం) మార్చి 12 : విజయనగరంలోని సంగీత కళాశాల ధరి, రంజనీ థియేటర్ ఎదురుగా వెంచేసియున్న శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి మహోత్సవాల్లో భాగంగాగురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ ఎల్లమాంబా సేవా సంఘం కమిటీ సభ్యులు ప్రసాద్, రమణ, సత్తిబాబుల ఆహ్వానం మేరకు, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త గా!! శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గారి కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు కమిటీ సభ్యులు, ఆలయ పూజారి సిరమ్మకు ఘనంగా స్వాగతం పలికారుఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి అమ్మవారును సిరమ్మ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి సిరమ్మ కు ఆశీర్వచనాలు అందించారు.అనంతరం ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్న భారీ అన్న సమారాధనలో సిరమ్మ పాల్గొని, తన చేతుల మీదుగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## సీతం లో ముగిసిన
# త్రీ డి ప్రింటింగ్ కార్యశాల




విజయనగరం: (ప్రజాస్వామ్యం) స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు "త్రీ డి ప్రింటింగ్ " అనే అంశంపై ఆరు రోజుల పాటు జరిగిన కార్యశాల విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యశాలలో శిక్షకుడిగా డాక్టర్ షేక్ సుర్జాన్ గత ఆరు రోజులుగా విద్యార్థులకు త్రీ డి ప్రింటింగ్ సాంకేతికత యొక్క మెళుకువలను అత్యంత ఆసక్తికరంగా నేర్పించారు. విడిభాగాల రూపకల్పన, పొరల వారీ నిర్మాణ పద్ధతులు, త్రీ డి మోడలింగ్ నుండి ప్రత్యక్ష నమూనా తయారీ వరకు విద్యార్థులు ఆచరణాత్మకంగా నేర్చుకున్నారు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, త్రీ డి ప్రింటింగ్ నేటి తయారీ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని, ఈ వర్క్షాప్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఆధునిక డిజైన్ మరియు ఉత్పత్తి నైపుణ్యాలతో సన్నద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారుకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. రామమూర్తి ఈ కార్యశాల యొక్క ప్రాముఖ్యతను మరియు ఆధునిక పరిశ్రమలో త్రీ డి ప్రింటింగ్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారుమెకానికల్ విభాగాధిపతి శ్రీమతి సి.హెచ్. వెంకటలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు త్రీ డి ప్రింటింగ్ ప్రక్రియను అర్థం చేసుకోవడమే కాకుండా, విడిభాగాల చిత్రీకరణ మరియు భాగాల సమీకరణపై పట్టు సాధించడం ఈ కార్యశాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యశాల నిర్వహణలో సహకరించిన అధ్యాపకులను మరియు విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యశాల విజయవంతంగా ముగిసింది.

# ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**భీమునిపట్నం** ప్రజాస్వామ్యం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ 15 వసంతాలను విజయవంతంగా పూర్తి చేసుకుని, 16వ ఏట అడుగుపెట్టిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని భీమిలి నియోజకవర్గంఆనందపురంలో ఉన్న వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ముందుగా సిరి సహస్ర (సిరమ్మ) మరియు భీమిలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు తైనాల విజయకుమార్ కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ:అరిచేత్తో సూర్యుడిని ఆపడం ఎంత అసాధ్యమో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఆపడం కూడా అంతే అసాధ్యం అని అన్నారు 2029లో మళ్లీ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై, జగన్ మోహన్ రెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఇప్పటి నుంచే నడుం బిగించాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత ప్రభుత్వం దోపిడీయే ధ్యేయంగా సాగుతోందని అక్రమంగా భూములు లాక్కోవడం, అవినీతికి పాల్పడటమే పనిగా పెట్టుకున్నారని రాష్ట్రంలో ఎక్కడా సరైన పరిపాలన కనిపించడం లేదని 2014లో లాగే, 2024లో కూడా తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చారని అధికారంలోకి వచ్చి



రెండేళ్లు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని అన్నారు ప్రజల పక్షాన పోరాడి 2029 ప్రజా కోర్టులో ఈ ప్రభుత్వానికి శిక్ష పడేలా చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో ఎస్ఇసి మెంబర్లు,రాష్ట్ర పార్టీ కార్యదర్శులు,మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ లు, జడ్పీటీసీ లు, జిల్లా నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మహిళ ప్రజా ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమోఘమైన జ్ఞాపక శక్తిని పెంచే అవధానం

ప్రజాస్వామ్యం / గజపతినగరం: మండలం లోని మర్రివలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులలో ఉన్న జ్ఞాపకశక్తిని పెంచేందుకు అవధానం అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకల చంద్రరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చందర్రావు మాట్లాడుతూ 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిరోజు కొంత సమయం కేటాయించి, కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థులలో జ్ఞాపక శక్తిని పెంపొందించవచ్చు అని, గతంలో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు సాధించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమం పై తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. అవధానం కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన దిలీప్, గాయత్రీలను ప్రధానోపాధ్యాయులు చందర్రావు అభినందించారు.



## గిరిజన మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాధి కార్యక్రమాలు



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 12 : పార్వతీపురం ఐ.టి.డి.ఏ పరిధి లోని 351 మంది గిరిజన మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 175.50 లక్షల ఆర్థిక సహాయంతో జీవనోపాధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఐటీడిఎ ఇంచార్జి ప్రాజెక్ట్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్టీ మహిళా అభ్యర్థులకు స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు ట్రైబల్ సబ్ స్కీమ్ (రాజూర్ శీ యూ) క్రింద ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సమన్వయంతో గిరిజన లబ్దిదారులకు జీవనోపాధి ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వివరించారు. తద్వారా ఒక్కొక్క గిరిజన మహిళా లబ్దిదారుకి గరిష్టంగా 50 వేల రూపాయలు సబ్సిడీ నిధులు ఇవ్వడమే కాకుండా యూనిట్ విలువలో మిగిలిన మొత్తానికి సెర్ప్ ఉన్నతి పథకం నిధులు జోడించి 56 రకాల జీవనోపాధుల కార్యక్రమాల అమలుకు ఋణ సౌకర్యం మంజూరుపై సెర్ప్ సీఈఓ విధివిధానాలను జారీ చేశారని తెలిపారు. అందులో భాగంగా పార్వతీపురం ఐటీడీఎ పరిధిలోని గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం మండలాల వారీగా యూనిట్లు కేటాయింపు చేసినట్లు చెప్పారుబలిజిపేటలో 4, గరుగుబిల్లిలో 4 , గుమ్మలక్ష్మీపురంలో 77, జియ్యమ్మవలసలో 21, కురుపాంలో 56, కొమరాడలో 35, మక్కువలో 21, పాచిపెంటలో 42, పార్వతీపురంలో 24, సాలూరులో 63, సీతానగరంలో 4 వెరసి 351 మంది లబ్దిదారులకి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కావున గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఎస్టీ మహిళా అభ్యర్థులు ఈ జీవనోపాధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూనిట్ల వివరాలు, విధివిదానాల సమగ్ర సమాచారం కొరకు సంబంధిత మండల ఏపీఎంలు లేదా సీసీ లను సంప్రదించాలని కోరారు. పార్వతీపురం నందు పాలక ప్రకాశరావు, జూనియర్ సహాయకులు, ఐ.టి.డి.ఏ., పార్వతీపురం, సెల్ ఫోన్ నెం. 83098 23132 వారిని సంప్రదించవలసినదిగా పీఓ ఆ ప్రకటనలో వివరించారు.

## ఎండల తీవ్రత పట్ల
# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలకు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి విజ్ఞప్తి**



ప్రజాస్వామ్యం/ పార్వతీపురం, మార్చి 12 : జిల్లాలో వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని, వడగా ల్పుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా చిన్నారులు, పశువుల సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంరక్షణలో భాగంగా అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పిల్లలకు ధారాళంగా సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందించాలని సూచించారు. గదులు చల్లగా, తగినంత గాలి వెలుతురు వచ్చేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే సమయాల్లో పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయట తిరగనివ్వకూడదని చెప్పారు. చిన్నారులకు తాజా పండ్లు, మజ్జిగ, ఓ.ఆర్.ఎస్ వంటి ద్రవపదార్థాలు అందజేయాలని, అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలోనూ అత్యవసర ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచాలని అన్నారు. అలాగే పశువులు కూడా వేసవిలో వడదెబ్బకు గురై మరణించే అవకాశం ఉన్నందున పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులను కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు బయటకు తీసుకెళ్లాలన్నారు. పశువులను ఎండ తగలకుండా షెడ్లలో లేదా దట్టమైన చెట్ల నీడలో ఉంచాలని, షెడ్ల చుట్టూ తడి గోనె సంచులు కట్టడం లేదా ఫ్యాన్లు/ఫాగర్స్ ఏర్పాటు చేసి లోపల వాతావరణం చల్లగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ప్రతి పశువుకు రోజుకు సుమారు 60-70 లీటర్ల పరిశుభ్రమైన చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని, పచ్చిగడ్డితో పాటు ఖనిజ లవణాల మిశ్రమాన్ని అందించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షించవచ్చని పేర్కొన్నారు. పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే దగ్గరలోని పశువైద్యశాలను లేదా రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SETPRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP)
Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022